దారులు అధ్వానం.. రాకపోకలకు నరకం

ఏళ్ల తరబడి వాహనదారుల అవస్థలు



6

గుంతలు పడి దెబ్బతిన్న తిమ్మాపూర్ రోడ్డు

ముఖ గుర్తింపుతో.. పెరిగిన హాజరు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	16
మొదటి సంవత్సరం విద్యార్థులు	2,950
ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	2,430
జూనియర్ కళాశాలలో టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్	279
గెస్ట్ లెక్చరర్లు	12

ముఖ గుర్తింపు హాజరుతో పెరిగిన శాతం - సుమారు 10 నుంచి 15 శాతం



జగిత్యాల బాలికల జూనియర్ కళాశాలలో హాజరు నమోదు చేస్తున్న అధ్యాపకురాలు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫలితమిస్తున్న ఎఫ్ఆర్‌సీ
- గైర్హాజరైతే తల్లిదండ్రులకు సమాచారం
- జిల్లాలో 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు.. ఐదు వేల మంది విద్యార్థులు

జగిత్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లాస్థాయి అధికారులతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షిస్తోంది. అధ్యాపకులతో పాటు సిబ్బందికి రోజుకు రెండుసార్లు ముఖ గుర్తింపుతో హాజరు అమలు చేస్తోంది. దీంతో పాటు ప్రతినెలా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తుండటం సత్ఫలితాలను ఇస్తోంది.

పెరిగిన హాజరు...

ముఖ గుర్తింపు హాజరు కోసం ఇంటర్ బోర్డు అధికారులు టీజీబీఐఈ ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తీసుకొచ్చారు. దీని ద్వారా ప్రస్తుతం ప్రతీరోజు విద్యార్థులకు హాజరు తీసుకుంటున్నారు. ఈ విధానం వల్ల గతంలో కంటే 10 నుంచి 15 శాతం విద్యార్థుల హాజరు శాతం పెరిగినట్లు అధికారులు అంటున్నారు. ఇంటర్‌బోర్డు వెబ్‌సైట్‌కు అనుసంధానం చేస్తూ ముఖ గుర్తింపు హాజరును రూపొందించారు. విద్యార్థుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

సెల్‌ఫోన్లకు సంక్షిప్త సందేశం...

ముఖ గుర్తింపు హాజరు ద్వారా ఏ విద్యార్థి అయినా కళాశాలకు హాజరు కాకుంటే తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు సంక్షిప్త సందేశం వెళ్తోంది. ఈ హాజరును కళాశాల ప్రిన్సిపాల్, డీఐఈవో, రాష్ట్ర అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సంక్షిప్త సందేశం వెళ్లిన తర్వాత వారి తల్లిదండ్రుల నుంచి సంబంధిత కళాశాల అధ్యాపకులకు ఫోన్ రాకపోతే, కళాశాల అధ్యాపకులే వారితో ఫోన్‌లో మాట్లాడి కారణాలను తెలుసుకుంటున్నారు. ఇలా చాలా రోజులు కళాశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు అధ్యాపకులు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి చదువు విశిష్టతను తెలిపి కళాశాలకు పంపేలా చేస్తున్నారు. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు నిర్వహిస్తున్నారు.



ఫలితాలు పెంచడమే లక్ష్యం...

బొప్పరాతి నారాయణ, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఇంటర్ బోర్డు ముఖ గుర్తింపు హాజరు ద్వారా ఏ విద్యార్థి అయినా కళాశాలకు హాజరు కాకుంటే తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు సంక్షిప్త సందేశం వెళ్తోంది. ఈ హాజరును ఆ కళాశాల ప్రిన్సిపాల్, డీఐఈవో, రాష్ట్ర అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెరుగుతోంది

కొట్టాల తిరుపతి, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్, జగిత్యాల



ముఖ గుర్తింపు హాజరు విధానం వల్ల విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు హాజరవుతున్నారు. దీంతో హాజరు శాతం పెరగడంతో పాటు, పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చు. కళాశాలకు హాజరు కాని విద్యార్థులపై పర్యవేక్షణ పెరుగుతోంది. వారి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాలకు విద్యార్థులు క్రమంగా కళాశాలకు వచ్చే విధంగా చేస్తున్నాం.

విద్యుత్ అధికారుల పొలంబాట

భీమారం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నెగూడెం సెక్షన్ పరిధిలో గల పసునూరులో శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ బండారి అశోక్ రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మోటార్లకు ఫైబర్ స్టార్టర్ బాక్స్‌లు పెట్టుకోవాలని, మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మన్నెగూడెం సబ్ ఇంజనీర్ హరిప్రసాద్, లైన్ ఇన్‌స్పెక్టర్ యూసుఫ్ హుస్సేన్, లైన్‌మెన్ రాజేష్, అసిస్టెంట్ లైన్‌మెన్ రాజేందర్, కాంట్రాక్టర్ మనోజ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లచ్చునాయక్, రైతులు పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించాలి

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నుంచి రాయికల్ మండలం కొత్తపేటకు రాత్రి 9 గంటల తర్వాత బస్సును పునరుద్ధరించాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పిప్పోజి మహేందర్‌బాబు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ ఇంజనీర్ కవితకు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. రాత్రి 9 గంటల తర్వాత బస్సు లేకపోవడంతో బస్టాండ్‌లలో పడుకోవాల్సి వస్తోందని, కొందరు సొంతంగా ఆటో రిక్షా తీసుకుని రావాల్సి వస్తుందని అన్నారు. రాత్రి 9 గంటల తర్వాత జగిత్యాల నుంచి రాయికల్ బస్సును నడిపే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎలిగేటి రమేష్, మోర హన్మాండ్లు, రాజ గంగారాం, శివ కుమార్ పాల్గొన్నారు.

అధికారులు సమయపాలన పాటించాలి

అదనపు కలెక్టర్ బీఎస్ లత



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

కొడిమ్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమయపాలన పాటించాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను, భూ భారతి ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపాలనా అధికారులు భూ భారతి రికార్డులకు సంబంధించి మోఖాపైకి వెళ్లి కచ్చితమైన నివేదిక తయారు చేయాలని సూచించారు. భూ భారతిలో తిరస్కరించిన తిరస్కరించని రికార్డులకు సంబంధించిన రిపోర్టు కచ్చితంగా ఉండాలన్నారు. అనంతరం మండలంలోని సంద్రల్లపల్లి గ్రామంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించారు. వండిన భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, రెవెన్యూ పరిశీలకులు కరుణాకర్, రాజారాం, తిర్మలాపూర్ జీపీవో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ సంబంధించి 45,05,220 లక్షల విలువ గల చెక్కులను పంపిణీ చేశామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. తక్షణమే కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్‌కు ఫోన్‌లో సూచించారు. వర్షాల వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెంటనే మక్కలను కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులను తిట్టడం కాకుండా అభివృద్ధిలో ముందుండి ప్రజలకు సేవ చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సూచించారు. శుక్రవారం మెట్‌పల్లి మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో పట్టణ, మండలంలోని 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, పుల్ల జగన్‌గౌడ్, ఓజ్జెల శ్రీనివాస్, డాకూరి వెంకటేష్, తహసీల్దార్ నీత, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మల్యాల ఎంపీవో బదిలీ

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మల్యాల ఎంపీవో ప్రవీణ్ బదిలీ అయ్యారు. పంచాయితీరాజ్‌శాఖ నుంచి హౌసింగ్ శాఖకు బదిలీ కాగా మల్యాల ఎంపీవో నుంచి రిలీవ్ అయ్యారు. ప్రవీణ్ హౌజింగ్ శాఖలో అసిస్టెంట్ మేనేజర్‌గా నియమితులు కాగా శుక్రవారం హైదరాబాద్‌లోని హౌజింగ్ శాఖ కార్యాలయంలో రిపోర్టు చేశారు. రెండు రోజుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పోస్టింగ్ ఇవ్వనున్నారని సమాచారం.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ 33 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జగిత్యాల రూరల్ ఆపరేషన్ ఏడీఈ తెలిపారు. కావున మండలంలోని ఒడ్డెలింగాపూర్, ఇటిక్యాల, తాట్లవాయి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయం

- విమర్శలు చేసేవారికి అభివృద్ధితోనే సమాధానం
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్/జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పననే తన ప్రధాన ధ్యేయమని, విమర్శించే వ్యక్తులకు అభివృద్ధితోనే సమాధానం చెబుతానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి, గుల్లపేట గ్రామాల్లో రూ.22 లక్షల20 వేలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. జగిత్యాల పట్టణంలోని చింతకుంట శ్మశాన వాటికలో 15వ ఫైనాన్స్ నిధులు 40 లక్షల రూపాయలతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ మర్మమతులు, 10 లక్షల సాధారణ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ అనంతారం బ్రిడ్జి నిర్మాణం విషయంలో కేంద్ర ప్రభుత్వంతోపాటు, ఎంపీ ధర్మపురి అర్వింద్ దృష్టికి తీసుకెళ్లానని త్వరలోనే బ్రిడ్జి నిర్మాణానికి కృషిచేస్తానని తెలిపారు. తక్కళ్లపల్లి గ్రామంలో బస్‌స్టాప్



గుల్లపేటలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

నిర్మాణం కోసం కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్, బాలె పంకర్, సమిండ్ల శ్రీనివాస్, కప్పల శ్రీకాంత్, పంబాల రాము, ఆరుముల్ల పవన్, కల్లెడ ప్యాక్స్ చైర్మన్ సందీప్‌రావు, సీనియర్ నాయకులు నక్కల రవీందర్‌రెడ్డి, దమ్మని బాలముకుందం, మాజీ జడ్పీటీసీ ఎల్లారెడ్డి, ములాసపు మహేష్, చీర్ల నరేష్, దమ్మ రాజిరెడ్డి, దమ్మ సురేందర్‌రెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, జక్కుల తిరుపతి పాల్గొన్నారు.

● **చెక్కు అందజేత**

జగిత్యాల పట్టణంలోని కౌసర్ మసీద్‌కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మూడు లక్షల 20 వేల చెక్కును శుక్రవారం అందజేశారు. పట్టణంలోని నాలుగో వార్డులో ఉన్న కౌసర్ మసీద్ అభివృద్ధికి నిధులు మంజూరు కాగా పనులు పూర్తి కావడంతో చెక్కును ఎమ్మెల్యే మసీదు బాధ్యులకు అందజేశారు. కార్యక్రమంలో క్యాదాసు నవీన్, కుసరి అనిల్, ఖాదర్ ముజాయిద్, చెట్‌పల్లి సుధాకర్, గాదె కార్తీక్ పాల్గొన్నారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం





మల్యాలలో తడిచిన ధాన్యం, ఎండపల్లి మండల కేంద్రంలో నేలకొరిగిన వరి

మల్యాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని వరి దాన్యం తడిసింది. మల్యాల, ముత్యంపేట, మానాల, సర్వాపూర్ తదితర గ్రామాల్లో దాన్యం తడువగా, కోతకు వచ్చిన వరి పంట నేలవాలిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు.

కొడిమ్యాల: మండలంలో శనివారం ఎండ కాచి ఒక్కసారిగా అకాల వర్షం కొంత సేపు కురవటంతో రైతులు ఆందోళన చెందారు. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడవకుండా రైతుల కవర్లను కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏవో పి జ్యోతి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం తడవలేదని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఉండి కవర్లను కప్పుకున్నట్లు తెలిపారు.



కొడిమ్యాలలో ధాన్యంపై కప్పిన కవర్లు

ఎండపల్లి: మండల కేంద్రంలో వాన రైతులను భయపెడుతోంది. వరి కోత దశలో ఉండగా.. నేడో రేపో కోద్దామనే సమయానికి వర్షం రైతుల పాలిట శాపమైంది. శుక్రవారం మండలంలోని రాజారాంపల్లి, చెర్లపల్లి, గుళ్లకోట, పాతగూడూర్, సూరారం గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరి నేలవాలగా దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు.

పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్

ధర్మపురి/జగిత్యాల రూరల్/రాయికల్/బీర్పూర్/ గొల్లపల్లి/ వెల్గటూర్ అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ధర్మపురి, రాయికల్, బీర్పూర్, జగిత్యాల రూరల్, గొల్లపల్లి, వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి స్థానిక జడ్పీహెచ్ఎస్ (బాలికల) విద్యార్థులకు, జగిత్యాల రూరల్‌పోలీస్ స్టేషన్‌లో సీఐ సుధాకర్, రాయికల్ ఎస్సై సుధీర్ రావు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు, బీర్పూర్ ఎస్సై రాజు సూర్య పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు, గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు, వెల్గటూర్‌లో ఎస్సై ఉమాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్‌లో భాగంగా ఆయుధాలు, సాంకేతిక పరికరాలు, పోలీసు ఉద్యోగాలు, విధులు గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ధర్మపురి ఎస్ఐలు ఉదయ్ కుమార్, రవీంద్రకుమార్, జగిత్యాల ఎస్ఐ సధాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఆయుధాల గురించి వివరిస్తున్న గొల్లపల్లి ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి

భూభారతి దరఖాస్తుల పరిశీలనలో జాప్యం చేయవద్దు

● **కలెక్టర్ సత్యప్రసాద్**

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం చేయవద్దని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు ఎన్ని పరిష్కరించారు.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారా అని ప్రశ్నించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులను పరిష్కరించాలని లేకపోతే తిరస్కరణకు గల కారణాలను మాడ్యూల్‌లో పేర్కొనాలని సూచించారు. మీసేవలో ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సర్టిఫికెట్లు జారీ చేయాలని అన్నారు. అనంతరం దుంపెట, కథలాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో పలు విషయాలపై చర్చించారు. ఇళ్ల నిర్మాణాలు నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసి బిల్లులు పొందాలని చెప్పారు. నిరుపేదలైన లబ్ధిదారులకు అవసరమైతే మహిళా సంఘాల ద్వారా రుణాలు అందించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా అందిస్తోందని కూలీల, రవాణా ఖర్చులు లబ్ధిదారులే భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వారంవారం ఇళ్ల నిర్మాణ ప్రగతిని తెలుసుకుంటూ వారికి బిల్లులు సకాలంలో అందేలా చూడాలని ఎంపీడీవోను ఆదేశించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులను పలు పాఠ్యాంశాలపై ఎంతమేర అవగాహన ఉందో పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో మరుగుదొడ్లు అవసరం ఉందని ఉపాధ్యాయులు, విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆయన వెంట కోరుట్ల ఆర్డీవో జివాకర్‌రెడ్డి, తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు ఉన్నారు.



కథలాపూర్‌లో భూభారతి రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జగిత్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పదోతరగతితో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని పదో తరగతి విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యాబోధన జరిగేలా చూడాలని ఆదేశించారు. నిర్దేశిత కార్యాచరణ ప్రణాళిక అమలు చేసి ఉత్తీర్ణత పెరిగేలా మెరుగైన బోధన చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జిల్లా విద్యాధికారి రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం


శ్రీనివాస్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని సత్తెపీరీల దర్గా సమీపంలోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మూల మలుపు వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గంబీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన కూలీ శివ రాత్రి శ్రీనివాస్(34) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గంబీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలోని శివ రాత్రి శ్రీనివాస్ దినసరి కూలీ పనులు చేస్తుండేవాడు. స్వగ్రామం నుంచి పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై రాచర్లగొల్లపల్లి వైపు వస్తున్న క్రమంలో సత్తెపీరీల దర్గా మూలమలుపు వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలపాలైన అతన్ని 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాస్ చనిపోయాడని నిర్ధారించారు. మృతుడికి తల్లి నర్సవ్వ, ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, అరవింద్ ఉన్నారు. మృతుడి సోదరుడు నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య


బుగ్గయ్య(ఫైల్)

ముస్తాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలో అనారోగ్యంతో మనస్తాపం చెంది ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సీహెచ్ గణేశ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికిచెందిన మానుక బుగ్గయ్య(70) కొంతకాలంగా అనారోగ్య కారణలతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొడుకు ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో పాము కాటుతో ఇద్దరు మృతి


శంకర్(ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిని పాము కాటు వేయడంతో ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గ మధ్యలో మృతిచెందిన సంఘటన మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ గ్రామానికి చెందిన దమ్మని శంకరయ్య(39) స్థానిక ప్రియామిల్క్‌లో ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం సాయంత్రం రాత్రి ఇంటికి వచ్చి నిద్రపోయిన శంకర్‌ను నాగు పాము కాటువేసింది. కుటుంబసభ్యులు వెంటనే 108లో కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. శంకర్‌కు ఏం కరిచిందో ఇంట్లో వేతికితే నాగుపాము కనిపించింది. దాన్ని స్థానికులు చంపేశారు. మృతుడు శంకర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పటి వరకు అందరితో కలిసి మెలిసి ఉన్న శంకర్ మృతిచెందడంతో గ్రామంలో విషాద చాయలు నెలకొన్నాయి.

రూపునారాయణపేటలో డిగ్రీ విద్యార్థిని..


అక్షిత(ఫైల్)

ఓదెల: ఓదెల మండలంలోని రూపునారాయణపేటకు చెందిన అక్షిత(18) అనే డిగ్రీ విద్యార్థి శుక్రవారం ఉదయం పాముకాటుకు గురై మృతి చెందింది. సుల్తానాబాద్ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న అక్షిత బతుకమ్మ పండుగకు ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం కాలుపై పాము కాటువేయడంతో గ్రామస్థుడి సలహాతో పాము కాటుకు మంత్రం వేయించేందుకు మరో గ్రామానికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో అక్షిత ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో 108అంబులెన్స్‌లో సుల్తానాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు.

దారులు అధ్వానం..
రాకపోకలకు నరకం

- ఏళ్ల తరబడి వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

జగిత్యాలరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలంలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా, తారు లేచిపోతున్నా నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోగా కనీసం మరమ్మతులకు నోచుకోవడంలేదు. గుంతల రహదారులపై ఇబ్బందుల మధ్య నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల భారిన పడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రహదారుల మరమ్మతు, నిర్వహణనుపట్టించుకోలేదని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల మండలం మోతె, జగిత్యాల రూరల్ మండలంలోని వెల్దుర్తి, నర్సింగాపూర్, వంజరిపల్లె, హన్మాజీపేట, తిప్పన్నపేట మీదుగా బాలపల్లికి వెళ్లే అంతర్గత రోడ్లు తారులేచిపోయి అధ్వానంగా మారాయి. గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు, రైతులు, విద్యార్థులు, రోడ్లపై ప్రయాణం చేయాలంటేనే నరకయాతన అనుభవిస్తున్నారు. రైతులు వేకువ జామున జగిత్యాలలోని మార్కెట్‌కు వెళ్లే క్రమంలో రోడ్లపై గోతులు కనబడకపోవడంతో ప్రమాదాలకు బారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అంతర్గత రోడ్లను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


తారులేచి అధ్వానంగా మారిన వెల్దుర్తి రహదారి

దెబ్బతిన్న రహదారులు...

జగిత్యాల జిల్లా కేంద్రానికి అతిసమీపంలో ఉన్న తిమ్మాపూర్-పొలాసకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. పది సంవత్సరాల కిందట నిర్మించిన ఈ రహదారి గోతులు, మట్టి నీటితో నిండిపోయి వాహనదారులకు నరకయాతనగా మారింది. వర్షం పడితే చెరువులా మారుతోంది. కాకతీయ కెనాల్ నీరు నిత్యం రోడ్డుపైనే ప్రవహిస్తోంది. పలుచోట్ల తారులేచిపోయి లోతైన గుంతలు ఏర్పడ్డాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందనలేకపోవడంతో గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు నోచుకోని రహదారులు

మల్యాల: మండలంలో అనేక గ్రామాల్లో గ్రామీణ రహదారులు అద్వానంగా మారాయి. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఈ రహదారులు ఇటీవల ఈ వానాకాలంలో వర్షాలకు మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో కోతలకు గురి కాగా కొన్ని చోట్ల వర్షపు నీటికి కొట్టుకుపోయాయి. రామన్నపేట నుంచి గొర్రెగుండం వెళ్లేదారి తారులేచి రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. రాంపూర్ నుంచి జగిత్యాల వెళ్లే రహదారికిరువైపులా లోతైన గోతులు ఏర్పడ్డాయి. అలాగే రాంపూర్ నుంచి రామన్నపేటకు వచ్చే మార్గం పనులు నిలిచి కంకర తేలింది. రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మల్యాల నుంచి సర్వాపూర్, బల్వంతాపూర్, గుడిపేట వెళ్లేదారులు అధ్వనంగా మారడంతో ప్రజలు ప్రయాణానికి పాట్లు పడాల్సి వస్తోంది. మండలంలో సగానికి పైగా గ్రామాల్లోని రహదారుల పరిస్థితి ఇలాగే ఉండగా ప్రజాప్రతినిధులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా గొర్రెగుండం వెళ్లే దారి

ప్రమాదాల బారినపడుతున్నారు..

- కొడిపల్లి నాగార్జున్, తిమ్మాపూర్



నిత్యం రద్దీగా ఉండే గ్రామాల అంతర్గత రోడ్లు దెబ్బతినడంతో ప్రయాణికులు, రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రమాదాలబారిన పడుతున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, గ్రామాల ప్రజలు రోడ్లపై ప్రయాణించడానికి నరకయాతన పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారుల నిర్మాణాలు చేపట్టాలి.

తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీ..

సైదాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెనపల్లి గ్రామంలో తాళంవేసి ఉన్న ఇళ్లలో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. దుద్దెనపల్లి గ్రామంలో బొరగల్ల నర్సవ్వ, బొరగల్ల రాజయ్య, బొల్లి నరేష్ అనేవ్యక్తులు తమ ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లగా గురువారం రాత్రి తాళాలు పగలగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఇండ్లలోని విలువైన వస్తువులు చోరీకి గురైనట్లు వారు తెలిపారు. ఈ విషయంపై పోలీసులను వివరాలు కోరగా, పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు.

బంగారు చైన్ అపహరణ

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని గోదావరి నది వద్ద భాగ్య అనే మహిళ పర్స్‌లో నుంచి అర తులం బంగారు చైన్ అపహరించిన సంఘటన శుక్రవారం జరిగింది. దీంతో ఆమె చుట్టు పక్కనే ఉన్న భక్తుల సహాయంతో చైన్ అపహరించిన మహిళను పట్టుకుని పోలీసులకు అప్పగించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేటకు చెందిన భాగ్య అనే మహిళ కుటుంబసభ్యులతో కలిసి గోదావరి నది స్నానం కోసం వచ్చింది. స్నానం చేసే సమయంలో స్నానఘట్టాల వద్ద బ్యాగులు, పర్స్ ఉంచి నదిలోకి వెళ్లింది. ఆ సమయంలో భిక్షాటన చేస్తున్న ఒక మహిళ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించింది. సదరు మహిళనే పర్స్‌లో నుంచి బంగారు చైన్ అపహరించిందని పోలీసులకు అప్పగించింది. బాధితురాలు భాగ్య బంగారు చైన్ చోరీ గురించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బంగారు చైన్ చోరీ గురించి పోలీసులు విచారణ చేస్తున్నారు.

హత్యానేరంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి జీవితఖైదు

- ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా
- కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు తీర్పు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తమ కూతురు ప్రేమించి కులాంతర వివాహం చేసుకుందనే కక్ష పెంచుకున్న ఆమె కుటుంబసభ్యులు చివరకు ఆమె భర్త ఆవునూరు శ్రీనివాస్(31)ని రాళ్లతో కొట్టి హత్యచేశారు. ఈకేసులో నిందితులు నలుగురికి జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి జే కవిత శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.... కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బ్రాహ్మణపల్లికి చెందిన మండల గౌతమి అదే గ్రామానికి చెందిన ఆవునూరి శ్రీనివాస్‌లు ప్రేమించుకున్నారు.

కొంతకాలం వేరే గ్రామంలో నివాసం ఉండి తిరిగి బ్రాహ్మణపల్లికి వచ్చి అక్కడే నివాసం ఉన్నారు. వారికి ఇద్దరు సంతానం కలిగారు. గౌతమి ఇతర కులానికి చెందిన శ్రీనివాస్‌ను వివాహం చేసుకోవటం తండ్రి మండల ఓదెలుకు ఇష్టం లేదు. దీంతో శ్రీనివాస్‌పై కక్ష పెంచుకున్న గౌతమి తండ్రి ఓదెలు(48), సోదరులు మండల సంపత్(28), మండల దేవేందర్(25), తల్లి మండల లక్ష్మి(45)లు గతంలో ఒకసారి దాడి చేయగా గౌతమి తండ్రి, సోదరుడిపై కేసులు నమోద య్యాయి. 2019జూన్ 19న రాత్రి ఆవునూరి శ్రీనివాస్ మద్యం సేవించి తన బైక్‌పై ఇంటికి వస్తూ మార్గ మధ్యలో గౌతమి తండ్రి ఇంటివద్ద బైక్ నిలిపి ఫోన్‌లో గౌతమితో మాట్లాడుతుండగా గౌతమి కుటుంబసభ్యులు నలుగురు శ్రీనివాస్‌పై రాళ్లతో దాడి చేశారు. ఈ రాళ్లదాడిలో శ్రీనివాస్ తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు.

ఈ ఘటనపై వీణవంక పోలీసులు గౌతమి కుటుంబ సభ్యులు నలుగురిపై కేసు నమోదు చేయగా జమ్మికుంట రూరల్ సీఐ ఏ రాములు దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి గౌతమి తండ్రి ఓదెలు, సోదరులు సంపత్, దేవేందర్, తల్లి లక్ష్మిలకు జీవితఖైదుతోపాటు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సైదాపూర్‌లో ఎలుగుబంటి సంచారం

- ఆందోళన చెందుతున్న ప్రజలు


సమ్మక్క గుట్ట వద్ద సంచరిస్తున్న ఎలుగుబంటి

సైదాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని సమ్మక్కగుట్ట వద్ద పెట్రోల్‌బంక్ ముందు నుంచి గురువారం రాత్రి ఎలుగుబంటి సంచరిస్తూ రోడ్డుపైవెళ్తున్న దృశ్యాలు పెట్రోల్ బంక్ సీసీకెమెరాలో రికార్డు అయ్యాయి. ఆ దృశ్యాలు బయటకి రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రైతులు రాత్రి బావుల కాడికి కరెంటు పెట్టేందుకు వెళ్తారని, ఎలుగుబంటి సంచారంతో ఇబ్బందులు ఉంటాయని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖాధికారులు ఎలుగుబంటిని బంధించి తీసుకుపోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

మహిళలకు బ్యూటీషియన్ కమర్షియల్ కోర్సుల శిక్షణ

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీకాలనీలోగల దుర్గాబాయి మహిళాశిశువికాస కేంద్రంలో జిల్లా మహిళానైపుణ్యాభివృద్ధి శిక్షణాసంస్థ కమర్షియల్ పద్ధతిలో 45రోజుల పాటు 15నుంచి 50సంవత్సరాలలోపు మహిళలకు వారి అనుకూల సమయాల్లో బ్యూటీషియన్‌కోర్సుపై శిక్షణను అందించనున్నట్లు కేంద్రం జిల్లామేనేజరు సుధారాణి శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. బ్యూటీషియన్‌లో వివిధరకాల కోర్సులనుబట్టి ఫీజు ఉంటుందని, ఆసక్తి గల మహిళలు ఆధార్‌జిరాక్స్, రెండు ఫొటోలతో నవంబర్13లోపు ఎల్ఎండీకాలనీలోని తమకార్యాలయంలో దరఖాస్తుచేసుకోవాలని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- తొమ్మిది మందిపై కేసు
- రూ 33,200 నగదు స్వాధీనం

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఒక గొర్రెల ఫామ్‌లో పేకాట ఆడుతున్న తొమ్మిదిమంది వ్యక్తులను శుక్రవారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.33,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలం నుంచి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే అందిన పక్కా సమాచారం మేరకు ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడిచేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. జూదం ఆడితే కేసులు నమోదుచేసి చట్టరిత్యా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఉదయ్‌కుమార్ హెచ్చరించారు.

మంథనిలోని గంగాపురి శివారులో..

మంథని, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని గంగాపురి శివారులో పేకాట శిబిరంపై శుక్రవారం దాడిచేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. కొందరు మూడు పత్తాలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేయగా గంగాపురి గ్రామానికి చెందిన మేడిశెట్టి సతీష్, ఓగ్గం అజయ్, దూడపాక రాజశేఖర్, ఎరుకల శేఖర్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.8150నగదు, 4సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న దాడి ప్రణీత్‌కుమార్ తన సెల్‌ఫోన్‌ను తీగలగుట్టపల్లిలో పోగొట్టుకోగా కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ పెద్దపల్లిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి శుక్రవారం ప్రణీత్‌కుమార్‌ను పోలీస్‌స్టేషన్ పిలిపించి సెల్‌ఫోన్‌ను అప్పగించారు. సెల్‌ఫోన్ రికవరీలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

విద్యార్థిని మృతదేహంతో ఎమ్మెల్యే ధర్నా, రాస్తారోకో

హుజూరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద వంగర గురుకుల పాఠశాలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని శ్రీవర్ష(15) మృతదేహంతో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని పీవీ రంగారావు గురుకుల పాఠ శాలలో హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని వి శ్రీవర్ష ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీపావళి పండుగ సందర్భంగా శ్రీవర్ష రాంపూర్ గ్రామానికి రాగా, గురువారం కుటుంబ సభ్యులు శ్రీవర్షను హాస్టల్‌లో వదిలి వచ్చారు. ఈ క్రమంలో హాస్టల్‌లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శ్రీవర్ష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వంగర ఎస్ఐ దివ్య హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఏరియా ఆస్పత్రికి చేరుకొని విద్యార్థిని కుటుంబ సభ్యులను ఓదార్చి, వారితో మాట్లాడారు. అనంతరం విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహాన్ని మోసుకుంటూ అంబేద్కర్ చౌరస్తా వద్దకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ముందస్తుగా పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ విద్యార్థిని మృతి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.


విద్యార్థిని శ్రీవర్ష మృతదేహంతో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, నాయకులు

- కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి..

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

శ్రీవర్ష కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.కోటి పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థిని మృతికి కారకులైనా వంగర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. విద్యార్థి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, కారకులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. శ్రీవర్షది ముమ్మాటికి ప్రభుత్వ హత్య అన్నారు. అనంతరం రాంపూర్ గ్రామానికి వెళ్లి బాలిక కుటుంబ సభ్యులకు రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పత్తి కూలీలపై తేనెటీగల దాడి

- 17 మందికి తీవ్ర గాయాలు


బాధితులను పరామర్శిస్తున్న మార్కెట్ చైర్మన్ ఎల్లయ్య

కోనరావుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 17 మంది పత్తి కూలీలపై తేనెటీగలు ఒకేసారి దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన కనగర్తి, సుద్దాల గ్రామాల మధ్య జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన 17 మంది కూలీలు ఉదయం పత్తి చేనులో పని చేస్తుండగా, సమీపంలోని తేనెపట్టు నుంచి ఒక్కసారిగా తేనెటీగలు వారిపై దాడి చేశాయి. దీంతో కూలీలు భయంతో పరుగులు తీశారు. దాడిలో పలువురు కూలీలు స్పృహ కోల్పోయారు. కూలీల ఆర్తనాదాలు విన్న స్థానికులు, చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారి సహాయంతో గాయపడిన కూలీలను చికిత్స నిమిత్తం వేములవాడ, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారు లావణ్య, సుమలత, దేవేంద్ర, కర్ణ, మమత, లత, తేజ, శృతి, రజితతో పాటు మరో 8 మంది కూలీలు ఉన్నారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారిని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ప్రజాప్రతినిధులు మంతెన సంతోష్, కచ్చకాయల బాల్‌రెడ్డి, నాలుక సత్యం, ఎరవెల్లి విజయ్, మల్లారెడ్డి, సంజీవ్, రవి, ఉప్పుల గంగయ్య, బుర్ర రమేష్, బొడ్డు రమేష్, సుంకరి రెడ్డి తదితరులు ఉన్నారు.

పొరండ్లలో జన్మించిన వింత గొర్రె పిల్ల

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొరండ్ల గ్రామంలోని తోడెంగ బాలయ్య అనే గొర్రెల కాపరికి చెందిన గొర్రె శుక్రవారం వింత గొర్రెపిల్లను జన్మనిచ్చింది. గొర్రె పిల్లకు 3తలలు, 3కండ్లు, 8కాళ్లు ఉన్నాయి. అయితే గొర్రె ఈనే సరికే గొర్రెపిల్ల మృతిచెంది ఉంది.

ఇసుకను తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబారిపేట శివారు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను రెవెన్యూ, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులుచేసి శుక్రవారం పట్టుకున్నారు. ఇసుకను లోడ్‌చేసుకుని వెళ్తున్న సమయంలో గ్రామస్థులు కొందరు గమనించి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో అధికారులు అక్కడికి చేరుకుని వాహనాన్ని పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్టు అధికారులు తెలిపారు.

బాలికపై అత్యాచారం కేసులో..
20 సంవత్సరాల జైలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మానసిక వ్యాధిగ్రస్తురాలైన బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానాతో పాటు బాలికకు నాలుగు లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి (ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు ఫర్ పోక్సో కేసెస్) రత్నపద్మావతి శుక్రవారం తీర్పు వెలువరించారు. కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన బాలికను నిందితుడు ఠాకూర్ అరవింద్ సింగ్ (22) అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి కోరుట్ల సీఐ రాజశేఖర్ రాజు, ఎస్సై సురేందర్ రెడ్డి కేసు విచారణ జరిపి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టుకు ఆదారాలు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ అధికారులు సాక్షులను ప్రవేశపెట్టారు. విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

గంజాయి నిందితులకు..
ఏడు సంవత్సరాల జైలు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా పండించి అమ్మకానికి యత్నించిన ఇద్దరు నిందితులకు ఏడు సంవత్సరాల జైలు శిక్ష, 20వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. 2021 అక్టోబరు 25వతేదీన మండలంలోని వర్షకొండ సమీపంలో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గిద్దె వినోద్, జాదవ్ రంజిత్ గంజాయి కలిగి ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. అప్పటి ఎస్సై రాజాప్రమీల అక్కడ తనిఖీ నిర్వహించగా అనుమానితులవద్ద నుంచి 2,200గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఓ కారు, ఐదువేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు గంజాయిని అక్రమంగా పండించి అమ్మకానికి ప్రయత్నించినట్లు తేలింది. నిందితులను పోలీసులు పట్టుకుని సాక్ష్యాలు ప్రవేశపెట్టగా జడ్జి శిక్షను ఖరారు చేస్తు తీర్పు వెలువరించినట్లు ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.

విప్‌పై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌పై ఫేస్‌బుక్‌లో రుద్రంగికి చెందిన గంటె ప్రసాంత్‌యాదవ్ అనేవ్యక్తి అనుచిత పోస్టులు పెట్టాడని కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎస్సై నవీన్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అవమానకర పోస్టులు పెట్టి విప్ ఆత్మగౌరవానికి భంగం కలిగించాడని అతనిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం కోరారు. ఈ సందర్భంగా లింగారావు, రంజిత్, రాములు ఉన్నారు.

నేలమట్టమైన రాజన్న లడ్డూ తయారీ కేంద్రం



లడ్డూ తయారీ కేంద్రం తొలగింపు అనంతరం రాజన్న ఆలయం వెనకభాగం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని పురాతన లడ్డూల గోదాం నేలమట్టమైంది. ఆలయ ప్రాకారానికి ఆనుకుని ఉన్న లడ్డూ గోదాం కూల్చివేయడంతో బాలాత్రిపురసుందరీదేవి ఆలయంతో పాటు సోమేశ్వర ఆలయాలు బయటకు కనిపిస్తున్నాయి. ఆలయ అభివృద్ధి పనుల కూల్చివేతలు గురువారం రాత్రి ప్రాకారం గోడలోకి ప్రవేశించాయి. ప్రాకారం లోపల భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు, ఆలయానికి దక్షిణవైపు ఉన్న కోటిలింగాల నుంచి ఏర్పాటు చేసిన క్యూలైన్ల తొలగింపు పనులు చకచకా జరుగుతున్నాయి.

16మంది పిల్లలకు ఓపెన్ హార్ట్ సర్జరీ


సుభాష్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ హార్ట్ సర్జరీ కోసం 15మంది చిన్నపిల్లలకు ఎంపిక చేసినట్లు జిల్లా ఇమ్యూనైజన్ (డీఐవో) అధికారి డాక్టర్ సాజిద తెలిపారు. రెండు రోజులపాటు జిల్లా జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 0 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచిత గుండె సంబంధిత వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. హైదరాబాద్ అపోలో ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 153 మంది పిల్లలు వివరాలను నమోదు చేసుకున్నట్లు, వారికి పరీక్షలు నిర్వహించి 23మందికి చికిత్స అవసరమని గుర్తించినట్లు పేర్కొన్నారు. వారిలో 16 మందికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరమున్నట్లు, 14మందికి రివ్యూ నిర్వహించనున్నట్లు డీఐవో తెలిపారు.



పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సైనిక్ స్కూల్ పిలుస్తోంది

- 2026-27కు ఎంపిక
- ఈనెల 30లోపు దరఖాస్తులకు అవకాశం



చొప్పదండి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రక్షణ రంగాల్లో పని చేయాలనుకునే వారిని సిద్ధం చేసేందుకు భారత రక్షణ శాఖ ఆధ్వర్యంలో సైనిక్‌స్కూల్స్ నడుస్తున్నాయి. ఇవి పిల్లల ఉజ్వల భవిష్యత్‌తో పాటు దేశ సేవ చేసే అవకాశం కల్పిస్తున్నాయి. సైనిక స్కూల్స్ దేశంలోని 33 సైనిక్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులను ఆహ్వానిస్తుంది. సైనిక స్కూల్స్ సొసైటీ ఆలిండియా సైనిక స్కూల్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ (ఏఐఎస్ఎస్ఈఈ) ఆధ్వర్యంలో 6, 9వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. రాత పరీక్ష, మెడికల్ ఫిట్‌నెస్ ఫిజికల్ వెరిఫికేషన్ మెరిట్ లిస్టు ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. అక్టోబర్ 30లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విజయనగరంలోని కోరుకొండ, చిత్తూరులోని కలికిరిలో సైనిక్‌స్కూల్స్ ఉన్నాయి.

పరీక్ష వివరాలు

- 6వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు 01-04-2014, 31-03-2016 మధ్యలో జన్మించి ఉండాలి. 9వ తరగతి పరీక్షకు 01-04-2011 నుంచి 31-03-2013 మధ్య జన్మించి ఉండాలి.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే చివరి తేదీ అక్టోబర్ 30. దరఖాస్తులను సరిదిద్దే అవకాశం నవంబర్ 2 నుంచి 4 వరకు అవకాశం కల్పించారు. జనవరిలో ప్రవేశ పరీక్ష జరుగుతుంది.
- పరీక్ష మొత్తం ఓఎంఆర్ పద్ధతిలో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 125 ఉంటాయి. 6వ తరగతిలో 300 మార్కుల పేపరు ఉంటుంది. 9వ తరగతి విద్యార్థులకు 400 మార్కుల పేపర్ ఉంటుంది.
- విద్యార్థులు ఒకేసారి మాత్రమే దరఖాస్తు చేయాలి. దరఖాస్తు అప్‌లోడ్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు చేయరాదు.
- దరఖాస్తులను హెచ్‌టీటీపీఎస్// ఎగ్జామ్స్.ఎన్‌టీఏ.ఎన్ఐసీ.ఇన్/సైనిక్ స్కూల్స్ సొసైటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి.
- తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లోని రెండు సైనిక్ స్కూల్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
- ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీలకు 700 రూపాయలు, జనరల్, ఓబీసీ, డిఫెన్స్, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు 850 రూపాయలు.
- ప్రవేశ పరీక్ష 13 ప్రాంతీయ భాషల్లో ఉంటుంది. ఎన్‌టీఏ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.
- ప్రవేశ పరీక్ష జనవరిలో జరుగనుండగా, పరీక్ష తర్వాత నాలుగు నుంచి ఆరు వారాల్లో ఫలితాలను ప్రకటిస్తారు.
- తాజా సమాచారం కోసం విద్యార్థుల తల్లితదండ్రులు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌ను తరచు గమనించాలి.
- ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే విద్యార్థులు ఎన్‌టీఏ హెల్ప్ డెస్క్ నంబర్ 011-040759000 లేదా ఏఐఎస్ఎస్ఇఇ.ఎన్‌టీఏ.ఏసీ.ఇన్‌కు మెయిల్ ద్వారా సంప్రదించాలి.



అర్బన్ ఎన్నికల్లో 59 నామినేషన్లు ఓకే

- 14 తిరస్కరణ
- నేడు ఉపసంహరణ, తుది జాబితా, గుర్తుల కేటాయింపు

కరీంనగర్‌టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు 12డైరెక్టర్ పదవులకు 73మంది నామినేషన్లు వేయగా వాటిని పరిశీలించిన అధికారులు 14 తిరస్కరించారు. 59నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్. మనోజ్‌కుమార్ ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ ఒకస్థానానికి 9మంది, మహిళా కేటగిరీలో ఏడుగురు, జనరల్ కేటగిరీలో 43 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ధ్రువీకరించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. ఆ తర్వాత తుది జాబితాను విడుదల చేయడంతోపాటు పోటీలోఉన్న అభ్యర్థులకు గుర్తులను కూడా కేటాయించనున్నారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ వరద గేట్లు

జగిత్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద పెరగడంతో శుక్రవారం గేట్లు మరోమారు తెరుచుకున్నాయి. ఎగువప్రాంతం నుంచి 22,154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నాలుగు వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పెద్దింటికి జీవన సాఫల్య పురస్కారం



పెద్దింటి అశోక్‌కుమార్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సినీ రచయిత పెద్దింటి అశోక్‌కుమార్‌కు జీవన సాఫల్య పురస్కారం లభించింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన సాహితీవేత్త అమృతలత ఏటా తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలకు చెందిన సాహితీ వేత్తలకు జీవన సాఫల్య పురస్కారాలు, అపురూప పురస్కారాలను అందిస్తున్నారు. జీవన సాఫల్య పురస్కారం-2025 సంవత్సరానికి రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సినీరచయిత పెద్దింటి అశోక్ కుమార్‌ను ఎంపిక చేసినట్లు శుక్రవారం ప్రకటించారు. నవంబరు 2న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జీవన సాఫల్య పురస్కారం గ్రహీతలకు రూ.25 వేలు నగదు, ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందజేసి సన్మానిస్తారు. రాజన్నసిరిసిల్లజిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పెద్దింటి అశోక్‌కుమార్‌కు జీవనసాఫల్య పురస్కారం రావడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

రాజన్న ఖజానాకు రూ.2.19కోట్ల ఆదాయం

- బంగారం 124.50 గ్రాములు, వెండి 10.5 కిలోలు



ఆలయ హుండీల డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2,19,35,165నగదు, 124గ్రాముల 500 మిల్లీల మిశ్రమ బంగారం, 10కిలోల 500 గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో రమాదేవి వెల్లడించారు. శ్రీరాజరాజేశ్వరస్వామి వారి గత36రోజుల హుండీలను ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో అత్యంత భద్రత మధ్య శుక్రవారం ఉద్యోగులు, సిబ్బంది లెక్కించారు. ఈవో రమాదేవి పర్యవేక్షించగా ఏసీ కార్యాలయ పరిశీలకులు రాజమౌళి, ఏఈవోలు, సూపరిండెంట్‌లు ఉద్యోగులు శ్రీరాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

కాల్ చేయండి.. సమస్యను పరిష్కరించుకోండి

- విద్యుత్ సమస్యలకు 1912తో చెక్
- టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు



మేక రమేష్‌బాబు, టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ

గణేశ్‌నగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మీ పరిధిలో కరెంట్ పోయిందా? మీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందా? అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదా? పొలాల్లో వదులు తీగలున్నా అధికారులు సరిచేయ డంలేదా? ఇలా సమస్య ఏదైనా సరే 1912కు కాల్‌చేస్తే వెంటనే సమస్య పరిష్కారం అవుతుందంటున్నారు టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు. 1912 నంబరుకు కాల్ చేస్తే మీటరు నంబరు, ఊరు, పేరు నమోదు చేసుకొని ఒక ఐడీ నంబరు ఇస్తారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కాల్‌సెంటర్ సిబ్బంది మీమొబైల్‌లో అందుబాటులో ఉంటారు. ఒకవేళ సమస్యపరిష్కారం కాకపోతే దానికి గల కారణాన్ని వివరిస్తారు.

యాప్ ద్వారా సైతం ఫిర్యాదు

టీజీ ఎన్‌పీడీసీఎల్ సాంకేతికత పెంచడంతో పాటు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. టీజీ ఎన్‌పీడీసీఎల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశముండగా నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులువుగా గుర్తు ఉండేలా 1912 నంబరును ట్రాన్స్‌ఫార్మర్‌ల మీద ముద్రిస్తున్నారు. ఫిర్యాదు చేయగానే మొబైల్‌కు ఫిర్యాదు నంబరు వస్తుంది. ఆ నంబరు ఆధారంగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతారు. పరిష్కారం ఆలస్యమైతే ఫోన్ చేసి పరిష్కారం ఏ దశలో ఉందో చెబుతారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబు తెలిపారు.

కొనసాగుతున్న గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురివద్ద గోదావరి హారతి మూడోరోజు శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభంనుంచి జరిగే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరంఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు దేశం సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ పూజలు జరిపారు. రాత్రి నదీమాతకు హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలమండలి చైర్మన్ జక్కురవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్త గణేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు



ట్రోఫీ అందుకుంటున్న కరీంనగర్ జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని కేహెచ్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు విశేష స్పందన లభించింది. పోటీల్లో అండర్-14 విభాగంలో కరీంనగర్ జిల్లా, అండర్-17 విభాగంలో పెద్దపల్లి జిల్లా జట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించాయి. జట్లకు రాఘవేంద్ర హాస్పిటల్ అధినేత డాక్టర్ శరత్ కుమార్ రెడ్డి ట్రోఫీలను పతకాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బాషబోయిన వేణుగోపాల్, కేహెచ్ఆర్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి, సురేందర్‌సింగ్, వ్యాయామ ఉపాధ్యాయులు కట్ట సంతోష్, సీహెచ్ శ్రీనివాస్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

యాదవులు రాజకీయంగా ఎదగాలి

- యాదవ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొమురయ్య యాదవ్



ఖాదర్‌గూడెంలో జరిగిన యాదవ రాజకీయ శిక్షణలో అభివాదం చేస్తున్న యాదవులు

మానకొండూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): యాదవులు రాజకీయంగా ఎదగాలని యాదవ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సొగాని కొమురయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామ శివారులో ఉమ్మడిజిల్లా యాదవ రాజకీయ శిక్షణ సదస్సు శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యాదవులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీపడి రాజకీయంగా పేద ప్రజలకు సేవ చేయాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యాదవులను సంఘటిత పరిచి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీలు యాదవులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్పా వారిని అభివృద్ధి చేయడం లేదన్నారు. ఇప్పటికైనా యాదవులు మేల్కొని రాజకీయాలలో ప్రవేశించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల అధ్యక్షులు నాగారపు సత్యనారాయణ, బల్కం మల్లేశ్ యాదవ్, రాజేందర్ యాదవ్, జాతీయ కౌన్సిల్ సభ్యులు బూస అంజన్న యాదవ్, రవీందర్ యాదవ్, మల్లేశ్ యాదవ్, కనబోయిన ఓదెలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కళతప్పిన పల్లె ప్రకృతివనం

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతివనాలపై అధికారుల పట్టింపు కరువైంది. గ్రామాల్లోని ప్రకృతివనాలు దట్టమైన చెట్లు, పిచ్చిమొక్కలతో కళాహీనంగా మారాయి. ఆహ్లాదం పంచేందుకు ఏర్పాటు చేసిన ప్రకృతివనంలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మల్యాల బ్లాక్‌చౌరస్తా సమీపంలో గల ప్రకృతివనం మందుబాబులకు అడ్డాగామారింది. క్రీడాపరికరాలు పిచ్చిమొక్కలలో కనిపించకుండా అధ్వానంగా మారింది.




మల్యాలలో అధ్వానంగా మారిన ప్రకృతివనం

దిగువ కొండగట్టులో వెలగని హైమాస్టు లైట్లు

- చీకట్లో ఇబ్బందులు పడుతున్న భక్తులు, స్థానికులు

మల్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-జగిత్యాల మార్గంలోని దిగువ కొండగట్టులో హైమాస్టు లైట్లు వెలగడం లేదు. పది రోజులుగా లైట్లు వెలగకపోవడంతో చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. దీంతో అంజన్న దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తీవ్రఅసౌకర్యంగా మారుతోంది. బస్సులు, ద్విచక్రవాహనాలు, కార్లు, తదితర వాహనాల్లో వేలాదిగా భక్తులు ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి వెళ్లడానికి దిగువకొండగట్టులోని స్టేజీనుంచి వెలుతుంటారు. అయితే చీకటిపడగానే ఈమార్గం కనిపించకపోవడంతో వాహనదారులు, నడిచివెళ్లే వారు అయోమయానికి గురి అవుతున్నారు. అలాగే స్వామివారి దర్శనం చేసుకొని కొండదిగి వచ్చే భక్తులు దిగువ కొండగట్టులో ఆటవస్తువులు, తీర్థయాత్ర సామగ్రి కొనుక్కోవడం పరిపాటి. కాగా లైట్లు లేక అసౌకర్యానికి గురి అవుతున్నారు. దిగువ కొండగట్టులో నివసించే జనాలు కూడా లైట్లు వెలుగకపోవడంతో చీకట్లతో ఆందోళన చెందుతున్నారు. హైమాస్టు లైట్లకు మరమ్మతులు చేయాలని, కొండ పైవరకు పూర్తి స్థాయిలో లైట్ల వెలుతురు ఉండేలా దేవస్థానం అధికారులు తగుచర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



హైమాస్టు లైట్లు వెలగక చీకటిమయంగా ఉన్న దిగువ కొండగట్టు ప్రాంతం

మహిళలకు వివిధ కోర్సులలో ఉచిత శిక్షణ

తిమ్మాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రంలో 18నుంచి 45సంవత్సరాలలోపు మహిళలకు స్వయం ఉపాధికై వివిధ కోర్సులకు ఉచిత శిక్షణను నవంబర్ 10నుంచి ప్రారంభించనున్నట్లు దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్ర జిల్లా మేనేజరు సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచితంగా అందించే కోర్సులు టైలరింగ్, జూట్‌బ్యాగ్ తయారీ, ఈ-ఆటో డ్రైవింగ్, ప్రీప్రైమరీ టీచర్‌ట్రైనింగ్ వంటి కోర్సులలో శిక్షణ పొందేందుకు 25మంది మహిళలకు రెండు నెలల పాటు శిక్షణ, ఉచితహాస్టల్ వసతిఅవకాశం కల్పించనున్నారు. ఆసక్తిగల మహిళలు తమ 7నుంచి 10వ తరగతి ఉత్తీర్ణత ధృవపత్రాలను, ఆధార్‌జిరాక్స్, రెండు ఫొటోలతో నవంబర్ 7లోపు ఎల్ఎండీ కాలనీలోని తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మహిళాప్రాంగణ మేనేజర్ తెలిపారు.

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

- భీమన్న ఆలయంలో కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- రాజన్న ఆలయంలో కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు



భీమన్న ఆలయంలో కోడెమొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి, భీమేశ్వర ఆలయాలు శుక్రవారం భక్తజనసంద్రంగా మారాయి. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలను ఏర్పాటు చేయడంతో భక్తులు భీమన్న దర్శనానికి పోటెత్తారు. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజన్న ఆలయంలోని ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. రాజన్నను దర్శించుకుని ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రాజన్నకు కోడె మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భీమన్న ఆలయానికి చేరుకున్నారు. దీంతో రాజన్న ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు భీమేశ్వర స్వామిని దర్శించుని కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గోవధ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు సత్యనారాయణరావు



నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ , బీజేపీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గోవధ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావు అన్నారు. గోరక్షకుడు సోనూసింగ్ అలియాస్ ప్రశాంత్‌పై తుపాకీతో కాల్చిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాస్తూ కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ రాజగౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణరావు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఘట్‌కేస్కర్ వద్ద గోవులను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచా రంతో లారీలను ఆపి, గోవులను రక్షించే ప్రయత్నం చేసిన సోనూపై ఇబ్రహీం అనే వ్యక్తి తుపాకీతో కాల్చడం దుర్మార్గం అన్నారు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన సదరు నిందితుడిని పట్టుకోవడంలో పోలీసుశాఖ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతోందని సత్యనారాయణరావు విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా వివిధ హోదాల బాధ్యులు యాదగిరిబాబు, నలువాల తిరుపతి, వడ్డేపల్లి శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, జుంబర్తి దివాకర్, ఆముద రాజు, కాయితి శంకర్, నరేందర్‌రెడ్డి, ఓరుగంటి చంద్రశేఖర్, సాంబారి కళావతి, జుంబర్తి దివాకర్, తుకారం గౌడ్, ఇట్యేని రమేష్, మర్రిపెల్లి సత్యం, రాజేందర్ పాల్గొన్నారు.

● నాయకుల నిరసన..

- విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ గోరక్షక విభాగం రాష్ట్రశాఖ పిలుపు మేరకు జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక తహసీల్ చౌర స్తా వద్ద భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గోరక్ష ప్రముఖ్ ఆడెపు నరేష్ మాట్లాడుతూ గోరక్షకు డు సోనూపై జరిగిన కాల్పుల ఘటన విచారక రమని, ఇది ఆటవిక పాలనకు నిదర్శనంగా భావిస్తున్నామన్నారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు రాజన్న, రాములు, సంతోష్, అరుణ్, మహేందర్, బీజేపీ నాయకులు ఏసీఎస్ రాజు, అరవ లక్ష్మీ, లింగంపేట శ్రీనివాస్, సీపెల్లి రవీందర్, ఠాకూర్ కిషోర్‌సింగ్, చీటి చంద్రశేఖర్‌రావు, మెరుగు ఉమేష్, అనిల్ ఉన్నారు.

నాణ్యమైన మక్కలనే కేంద్రానికి తీసుకురావాలి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన మొక్కజొన్నను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి ఏఎంసీలోని తూకం వేస్తున్న మొక్కజొన్నను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. మార్కెట్ యార్డులోని మొక్కజొన్న కుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ శాతం తగ్గిన తరువాతనే మొక్కజొన్నను కేంద్రానికి తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కేంద్రం ఇన్‌చార్జి జెట్టి నర్సయ్యతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు, సిబ్బంది, హమాలీలు, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మేడిపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో మేడిపల్లిలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను నాయకులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వినోద్, మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ షాహిద్ అలీ, సీఈవో బొందయ్య, నాగరాజు, బలగం రాజేష్, జలందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యూసుఫ్, రైతులు పాల్గొన్నారు.


మెట్‌పల్లి ఏఎంసీలోని తూకంను పరిశీలిస్తున్న చైర్మన్ కూన గోవర్ధన్

భీమారం: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కానుగంటి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్ అన్నారు. మండలంలోని దేశాయిపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొను గోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మిట్టపల్లి రాజరెడ్డి, సభ్యులు ఏలేటి మహేష్, పల్లి భీమయ్య, అయిత మోహన్, మాలోతు హన్మంతు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మడి రవి, అధికార ప్రతినిధి ఎనుగంటి హరీష్, ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు, కొప్పెర జలంధర్, కుంట దిలీప్, దాసరి శంకర్, ఆవ శంకర్, రాజరెడ్డి, వంగ వెంకటేష్, జలంధర్ రెడ్డి, అంగడి ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీల్లో జగిత్యాలకు చెందిన ఎస్ఎం అకాడమీకి చెందిన క్రీడాకారులు గోపు మణిదీప్‌రెడ్డి, బిడిగె అభిరామ్, మోక్షప్రదలు అండర్ 17 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కోచ్ పొడేటి శ్రీకాంత్ తెలిపారు. నవంబర్ నెలలో ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ కనబరుస్తూ జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న విద్యార్థులను జిల్లా ఎస్ఎం అకాడమీ బాధ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

మక్కల కొనుగోలు పరిమితిని సడలించాలి

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మక్కల కొనుగోళ్ల ఎకరానికి 18 క్వింటాళ్ల పరిమితిని సడలించి 30 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్‌కు శుక్రవారం రైతు నాయకుడు తురగ శ్రీధర్‌రెడ్డి వినతిపత్రం సమర్పించారు. రైతులు ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు మక్కలు పండిస్తారని, రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఎకరానికి 18 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ఆంక్షలు విధించారన్నారు. ఇలాంటి ఆంక్షలు వలన రైతులు మక్కలను దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. రైతులు పండించిన మక్కలను ఎకరానికి 30 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు సుతారి తిరుపతి, బొడుగం రాజు, బొడుగం రాము, నీలి రాములు, కిరణ్ రెడ్డి, నరేష్, నవీన్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో పోగొట్టుకున్న పుస్తెను మహిళలకు అప్పగించిన జంగిలి తిరుపతి అనే యువకుడిని గ్రామస్థులు శుక్రవారం సన్మానించారు. గ్రామంలో ఒక మహిళ పుస్తెను పోగొట్టుకోగా జంగిలి తిరుపతి అనే యువకుడికి దొరికింది. దీంతో సదరు యువకుడు తనకు పుస్తె దొరికినట్లు ఫొటో తీసి వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. బాధిత మహిళ వెంటనే తిరుపతిని సంప్రదించి పుస్తె తనదేనని చెప్పడంతో ఆమెకు అందించారు. 25 వేల రూపాయల విలువ గల బంగారు పుస్తెను నిజాయితీగా అందించిన తిరుపతిని గ్రామస్తులు శాలువాకప్పి సన్మానించి, ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో న్యాయవాది జాజాల రమేష్, శ్యామల మదుకర్, పురంశెట్టి సుధాకర్, కొదురుపాక మల్లేశం, వేముల రమేష్, పాదం పోచమల్లు, ఈదునూరి బక్కయ్య, గుర్రం మహేష్, జుంజురు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

మల్యాల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మేరా భారత్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఆధ్వర్యంలో జగిత్యాలలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీలలో అత్యధిక బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

కోరుట్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. మెట్‌పల్లి డీఎస్పీ అడ్డూరి రాములు పాల్గొని ప్రారంభించారు. ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీసు సిబ్బందితో పాటు పలు గ్రామాలకు చెందిన యువజన సంఘ నాయకులు, వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు, వ్యాపారులు రక్తదానం చేశారు. అంతకుముందు విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు అమరవీరులకు డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐ సురేష్ బాబు, కోరుట్ల, మేడిపల్లి ఎస్ఐలు చిరంజీవి, రామచంద్రుడు, శ్రీకాంత్‌రెడ్డిలతో పాటు పోలీసు సిబ్బంది, యువజన సంఘ నాయకులు, వివిధ పార్టీల శ్రేణులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ అడ్డూరి రాములు మాట్లాడారు. పోలీస్ అమర వీరులను స్మరిస్తూ రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన అందరికి అభినందనలు తెలిపారు. సేకరించిన రక్తంను భద్రపరిచి జగిత్యాలకు రెడ్‌క్రాస్ సభ్యులు తరలించారు. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సెక్రెటరీ మంచాల కృష్ణ, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ రాములు, అధికారులు

చదువుతోపాటు క్రీడలూ అవసరమే

జగిత్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చదువుతోపాటు ఆటలు కూడా అవసరమని జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆలియా మక్సూద్ అన్నారు. వివిధ స్థాయిల్లోని పలు క్రీడాంశాల్లో ప్రతిభను కనబర్చిన కళాశాల విద్యార్థులకు శుక్రవారం అభినందన సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈనెల 23వ తేదీన మైభారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ద్వితీయస్థానం సాధించిన జట్టును అభినందించారు. 17 ఏళ్లలోపు ఎస్‌జీఎఫ్ చెస్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గాజంగి దేవీశ్రీ, హర్షిణిని, 19 ఏళ్లలోపు బాస్కెట్ బాల్ లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైన పి.శైలజ, శరణ్యలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కొట్టాల తిరుపతిరెడ్డి, అధ్యాపకులు కేశినేని తిరుపతి, రిజ్వానా, రాజయ్య, జగన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి గో విజ్ఞాన పరీక్షలకు ఎంపిక

రాయికల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాయికల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి కొత్తపల్లి శ్రీరామ్ రాష్ట్ర స్థాయి గో విజ్ఞాన పరీక్షలకు ఎంపికయ్యాడు. జగిత్యాల జిల్లా గో సేవా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి గో విజ్ఞాన పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో శ్రీపతి రాఘవులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎంఈవో, ఉపాధ్యాయులు అభినందించారు.

జగిత్యాల అగ్రికల్చర్: వైష్ణవ ఠాకూర్ ఫౌండేషన్, గోసేవ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గోవిజ్ఞాన పరీక్షకు న్యూఏస్ హై స్కూల్ ఆర్ఎస్‌టీ నగర్‌నుంచి 23మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పరీక్షకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ వెల్మ రఘుపతి రెడ్డి, హెచ్ఎం భూషణ్ చౌరస్య లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్‌లు పన్నాల రాజిరెడ్డి, గడ్డం రామకృష్ణారెడ్డి అభినందించారు. ఈనెల 26న హైదరాబాద్ నారాయణగూడలో గల కేశవ మెమోరియల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరుగుతుందని వారు తెలిపారు.

విద్యార్థులు విద్యతో పాటు ఆటల్లోనూ రాణించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చెస్ పోటీల్లో మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బబ్బిలి అక్షయ్ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో అక్షయ్‌ను శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి ఎమ్మెల్యే సత్కరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన చెస్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడని పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరించిన విద్యార్థిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలకు నిర్వహకులు ఎంపిక చేశారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటల పోటీలలో ఎంపికైన క్రీడాకారులకు మరింత శిక్షణ ఇవడంతో పాటు ప్రోత్సహించాలని ఉపాధ్యాయుకలు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

మేడిపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సహకార సంఘాల జిల్లా అడిట్ ఆఫీసర్ సత్యనారయణ సూచించారు. మేడిపల్లిలో మండలంలోని నాలుగు సహకార సంఘాల సీఈవోలకు, సెంటర్ నిర్వాహకులకు, కంప్యూటర్ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారికి కొనుగోలు కేంద్రాల నిర్వాహన, తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీఈవో తోర్తి గోపి, తిరుపతిరెడ్డి, బొందయ్య, జయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులపై చిత్తశుద్ధిలేని రాష్ట్ర ప్రభుత్వం

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత


మోరపల్లిలో మొక్కజొన్నను పరిశీలిస్తున్న దావ వసంత

జగిత్యాలరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు. జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో శుక్రవారం వసంత పర్యటించి రైతులు పండించిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వసంత మట్లాడుతూ ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంటలు దళారుల పాలయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. క్వింటాల్ మొక్కజొన్నకు 500 రూపాయలు నష్టం ఏర్పడుతుందని తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు పరిమితిపై ఆంక్షలను సడలించాలని ప్రభుత్వాన్ని కోరారు. పేదల అభివృద్ధిని, సంక్షేమం కాంక్షించాల్సిన సీఎం ప్రజల పట్ల రాష్ట్రం పట్ల కనీస బాధ్యతలేకుండా వ్యవహరించడం బాధాకరమన్నారు. 2,400 రూపాయల మద్దతు ధర ఉన్న మొక్కజొన్నను 1,850 రూపాయలకు రైతులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ప్యాక్స్ చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, నాయకులు కమలాకర్ రావు, గంగారావు, కురుణాకర్‌రావు, గంగారెడ్డి, శరత్, లిం గారెడ్డి, రాజిరెడ్డి, భూమరాజం, శేఖర్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

టీకాలతో మూగజీవాలకు రక్షణ

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు టీకాలు వేయించడం వలన వ్యాధులు రాకుండా రక్షణ కలుగుతుందని జిల్లా పశువైద్య, పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ ప్రకాష్ అన్నారు. పశువైద్య, పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో మండల పశువైద్యాధికారి మనీషాపటేల్ శుక్రవారం మండలంలోని బండలింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ ఆవులు, గేదెలు, దూడలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. అపోహలు మాని ఉచిత గాలికుంటు నివారణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ మనీషాపటేల్, అశ్విని, అశోక్, సిబ్బంది రమణయ్య, గంగాధర్, చిరంజన్, దిలీప్, మోహన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: గాలికుంటు వ్యాధి టీకాలు వేయించడం ద్వారానే మూగజీవాలు వ్యాధులు దరి చేరకుండా ఆరోగ్యవంతంగా ఉంటాయని మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమలత పేర్కొన్నారు. శుక్రవారం పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్‌లో పశువులకు గాలి కుంటు నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మతిన్, వినీత్, శంకరయ్య, జానీపాష తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైర్డ్ అయిన కొరిడె విశ్వనాథ్‌శర్మ కంప్యూటర్ సిస్టమ్‌ను శుక్రవారం బహూకరించారు. పాఠశాల హెచ్ఎం పెండ్యాల మహేందర్ విజ్ఞప్తి మేరకు విశ్వనాథ్‌శర్మ రూ 20,000 విలువ గల కంప్యూటర్‌ను బహుమతిగా అందించారు. కార్యక్రమంలో కంప్యూటర్ దాత కొడుకు కొరిడె అభిరామ్, పాఠశాల హెచ్ఎం పెండ్యాల మహేందర్, ఉపాధ్యాయులు కాసర్ల నరసింహమూర్తి, వెంటకస్వామి, గొల్లపెల్లి గణేష్, జాడి పద్మ, జ్యోతి, అతియాబేగం, ఆసిఫ్, స్టాఫ్ సాయి, శ్రీనిధి పాల్గొన్నారు.

అదనంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కథలాపూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కేవలం 13 మాత్రమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని మరిన్ని అదనంగా ఏర్పాటు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అరకొర కేంద్రాలతో ప్రభుత్వం చేతులు దులుపుకుందని దీంతో రైతాంగం అవస్థలు పడాల్సి వస్తోందని అన్నారు. కోతలు పూర్తయి 15 రోజులు గడుస్తున్నా నేటికీ కేంద్రాల్లో కొనుగోళ్ళు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. దీంతో విధిలేక దళారులకు రు. 2వేలకు క్వింటాల్ చొప్పున విక్రయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన వెంట రైతు నాయకుడు తిరమల్‌రెడ్డి ఉన్నారు.

గ్లోబల్ శాంతి పురస్కారం ప్రదానం

మెట్‌పల్లిటౌన్,అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అల్లకట్టు సత్యనారయణ అంతర్జాతీయ ఐక్యరాజ్య సమితి దినోత్సవం సందర్భంగా వివిధ సేవలకు గాను గోల్డెన్ ఎరా బుక్ ఆఫ్ రికార్డ్ వారు సత్యనారయణకు గ్లోబల్ శాంతి పురస్కారము ప్రశంస పత్రం శుక్రవారం అందజేశారు. పురస్కారం అందుకున్న సత్యనారయణ పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- ఎంపీడీవో రామకృష్ణ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కోరుట్ల రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ప్రభుత్వ ప్రకటించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ కృష్ణ చైతన్య సూచించారు. శుక్రవారం మండలంలోని పైడిమడుగు గ్రామంలోని హరిజన వాడలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీడీవో రామకృష్ణ, కల్లూర్ మోడల్ స్కూల్‌లో తహసీల్దార్ కృష్ణ చైతన్య మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో నిల్వ ఉన్న సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం విద్యార్థుల తో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్య క్రమంలో రెవెన్యూ, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఇబ్రహీంపట్నం ఎంపీడీవో సలీం సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని గోధుర్ ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనంను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట గ్రామకార్యదర్శి హన్షద్, ఉపాధ్యాయులు కల్పన, సుధాకర్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి అడ్లూరి పరామర్శ


చందును ఓదార్చుతున్న మంత్రి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ల్యాగలమర్రి గ్రామానికి చెందిన బాధిత కుటుంబాన్ని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. మంత్రి వ్యక్తిగత డ్రైవర్ చందు తల్లి నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందగా విషయం తెలుసుకున్న మంత్రి లక్ష్మణ్ కుమార్ ల్యాగలమర్రి వెళ్లి పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. మంత్రి వెంట మండల కాంగ్రెస్ నాయకులు ఒరుగల శ్రీనివాస్, మారం కొమురయ్య, మందపెల్లి అంజయ్య, కడారి తిరుపతి, రవినాయక్ తదితరులు ఉన్నారు.

వెల్గటూర్: మండలంలోని రాంనూర్ గ్రామానికి చెందిన బిడారి శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేంధర్‌రెడ్డి, జితేంధర్‌రెడ్డి, గోల్ల తిరుపతి, జగదీశ్వర్‌రెడ్డి, మంజుల, రామగిరి నందయ్య, గంగయ్య, లక్ష్మణ్, భూమయ్య, తిరుపతి పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా మంత్రి

ధర్మపురి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త శాతాల్ల నారాయణ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నారాయణ కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడి ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు నారాయణ కుటుంబసభ్యులకు 25 వేల ఆర్థికసాయాన్ని పార్టీ నాయకుల ద్వారా శుక్రవారం అదించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జగిత్యాల, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2.0 పథకం తాగునీటి సమస్య పరిష్కారానికి ఉపయోగపడుతుందని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి నిరంతరాయంగా కుళాయి ద్వారా నీరు అందించాలనేదే అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫర్మేషన్ పథకం ఉద్దేశమన్నారు. పట్టణ మురుగు నీటి వ్యవస్థను మెరుగుపర్చి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచవచ్చన్నారు. కార్యక్రమంలో జేడీ అశ్విని, డీటీసీపీ ఏడీ జ్యోతి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధం పై అవగాహన సదస్సు

గొల్లపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధం, మహిళా భద్రతలపై విద్యార్థులకు జగిత్యాల జిల్లా భరోసా కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు, మహిళలు ఏదైనా అన్యాయానికి గురైనప్పుడు బాధపడకుండా గోల్డెన్ సర్కిల్ స్టార్ ఫర్ ఫియర్ మంకీ మైండ్ థెరపీల ద్వారా ఒత్తిడిని జయించవచ్చని, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని భరోసా కేంద్రం అధికారి సుజాత పేర్కొన్నారు. షీ టీమ్స్ అధికారి పూజిత విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. సదస్సులో ప్రిన్సిపాల్ ఏనుగు మల్లయ్య, ఇంపాక్ట్ పౌండేషన్ ట్రైనర్ శ్రీనివాస్, స్టూడెంట్ కౌన్సిలర్ రాంప్రసాద్, ప్రసాద్, రాజు, తిరుపతి, బాలరాజు, నాగలక్ష్మీ, శ్రీనివాస్, రత్నాకర్, సంతోష్, లక్ష్మణ్ తదితర లెక్చరర్లతో పాటు భరోసా కేంద్రం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొడిమ్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలానికి చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం శనివారం రానున్నట్లు మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం లో, మండలంలోని పూడూర్, చెప్యాల, రామకిష్టాపూర్ గ్రామాల్లో సింగిల్ విండో ల, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

జగిత్యాల టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల రాజుకు జగిత్యాలకు చెందిన ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్ దాతల సహాయంతో సేకరించిన 37,446 రూపాయలను స్పెషల్ బ్రాంచ్ సీఐ ఆరిఫ్‌అలీఖాన్ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. రాజు అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా ఇటీవల కాలుకు ఇన్‌ఫెక్షన్ కాగా రాడ్ వేశారు. రాజు ఆరోగ్య పరిస్థితిపై చేసిన విజ్ఞప్తికి స్పందించిన ఏఎస్సై రాజేశుని శ్రీనివాస్ తాను నిర్వహిస్తున్న వాసవి సేవాదళ్ గ్రూప్ ద్వారా సేకరించిన మొత్తాని రాజుకు అందజేశారు.

టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వినోద్

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టెక్నికల్ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పత్తిరెడ్డి వినోద్‌కుమార్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సంఘ సభ్యుల సమావేశం నిర్వహించి, జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా ర్యాగల్ల శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దురిశెట్టి దయాకర్, ఉపాధ్యక్షులుగా బూరుగుపల్లి శైలజ, ట్రెజరీగా నాయిని మహేష్ గౌడ్‌తో పాటు ఉపాధ్యక్షులుగా రేవెల్ల నానిగౌడ్, చౌలమద్ది విజయ్‌కుమార్, నునావత్ సుధాకర్, మారంపల్లి శ్రీనివాస్, కాటిపల్లి జలపతిరెడ్డి, టెక్నికల్ అడ్వైజర్‌లుగా మీసాల మల్లయ్య, బసవరాజుల రాజు, సోషల్ మీడియా కన్వీనర్ జక్కుల నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

నిరసన ప్రదర్శనను విజయవంతం చేయండి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన నిందితుడిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగా పిలుపు మేరకు నవంబరు 1న నిర్వహించనున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సురుగు శ్రీనివాస్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగాధర్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో చటిపెల్లి లక్ష్మణ్, బెజ్జంకి సతీష్, బోనగిరి కిషన్ తదితరులు పాల్గొన్నారు.